క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



నూజివీడు: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో నూజివీడు నియోజకవర్గానికి చెందిన పలు జట్లు ప్రతిభను కనబరిచాయి. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పురుషుల విభాగంలో వాలీబాల్‌లో జిల్లా ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం, క్రికెట్‌లో ద్వితీయ స్థానం, ఖోఖోలో తృతీయస్థానాన్ని సాధించారు. మహిళల విభాగంలో షటిల్ డబుల్స్‌లో నూజివీడు నియోజకవర్గ జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రవీంద్ర తెలిపారు. పోటీలను నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయులు పర్యవేక్షించారు.

టెన్త్ మోడల్ టెస్ట్ కరపత్రాల ఆవిష్కరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 5న టెన్త్‌క్లాస్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ తెలిపారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో మోడల్ టెస్ట్ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



ఇబ్రహీంపట్నం: సమాజంలో నిరాదరణకు గురైన దివ్యాంగ చిన్నారులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల అవసరాల నిమిత్తం సియోను మినిస్ట్రీస్ సమకూర్చిన ఫ్యాన్లు, స్టడీ, ప్లే మెటీరియల్‌ను విద్యార్థులకు శుక్రవారం ఆయన అందజేశారు. విద్యార్థులు సమాజంలో తలెత్తుకుని జీవించేలా విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పాస్టర్ సురేష్‌బాబు, పాస్టర్ విలియమ్స్, హెచ్ఎం నరసమ్మ, రాజేష్, పల్లె జాన్‌బాబు, నల్లమోతు ప్రసన్నబోసు, సీఆర్పీలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మైలవరం: మైలవరం పూరగుట్టకు చెందిన యువకుడు లేళ్ల నాగబాబు శుక్రవారం తెల్లవారు జామున ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాల్‌మనీ వేధింపులే తన భర్త ఆత్మహత్యా యత్నానికి కారణమని నాగబాబు భార్య రజనీ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాల్‌మనీ నడుపుతున్న వ్యక్తులు తన భర్తను వేధింపులకు గురిచేస్తున్నారని, వారికి ఇవ్వాల్సిన బాకీ చెల్లించిన తర్వాత తమ ఇంటిని స్వాధీనం చేసుకుని కూడా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఏ.కొండూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి అన్నారు. రామచంద్రాపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అల్పాహారం అందించారు. శివారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులకు నెలకు సరిపడా అల్పాహారం తయారు చేసేందుకు గోధుమ రవ్వ, శనగలు, మంచినూనె అందించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలసంఘ సభ్యులకు శిక్షణ

పెనుగంచిప్రోలు:స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమ నిర్వహణపై గ్రామ జలసంఘ సభ్యులకు శుక్రవారం శిక్షణనిచ్చారు. కమ్యూనిటీ కాంట్రాక్టు వ్యవస్థలో పనుల నిర్వహణపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి నిర్వహించే పనులను స్థానిక మహిళా సంఘాలకు అప్పగించినట్లు వివరించారు. జల్‌జీవన్ మిషన్ జిల్లా రిసోర్స్ పర్సన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయా పనుల నిర్వహణకు సంబంధించి విషయాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఎంపీడీఓ సాయిహర్ష, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలతో చేరువైన సేవలు

- గ్రామాల్లోనే అందుబాటులోకి అన్ని సేవలు
- సిఫార్సులు లేకుండానే అందుతున్న ప్రభుత్వ పథకాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు

నూజివీడు: ఏ చిన్న పని ఉన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. అదంతా గతం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అన్ని సేవలు సచివాలయాల ద్వారా అందిస్తున్నారు. గ్రామంలోనే ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే చాలు.. పనులన్నీ అయిపోతున్నాయి. ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ అందరి మన్ననలను అందుకుంటోంది. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి మండల కేంద్రాలకు వెళ్లే పని లేకుండా ఉన్న ఊరిలోనే సకల సేవలు అందుతుండంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తుక్కులూరులోని గ్రామ సచివాలయ భవనం

ధ్రువీకరణ పత్రాల నుంచి కరెంటు బిల్లుల వరకు..

గ్రామ సచివాలయాల ద్వారా జనన, మరణ, నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ దగ్గర నుంచి పాసుపుస్తకం, రేషన్‌కార్డు, ఫ్యామిలీ సర్టిఫికెట్, ఎన్‌ఓసీ తదితర ధ్రువీకరణ పత్రాలు సైతం ప్రజలకు అందిస్తున్నారు. కరెంటు బిల్లులను సైతం ఇక్కడే చెల్లించవచ్చు. ఇలా దాదాపు 550 రకాల సేవలను సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తుండటంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తప్పాయి. నూజివీడు నియోజకవర్గంలో 92 సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం సేవలు అందిస్తోంది. ప్రజలు ఏదైనా ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయంలో అర్జీని పెట్టుకుంటే 30 నిమిషాల నుంచి 72 గంటల్లో వాటిని అందిస్తున్నారు.

అందుబాటులో ఉన్న సేవలు

ప్రతి సచివాలయంలో ఈ–సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 550 రకాలకు పైగా సేవలు ప్రజలకు అందుతున్నాయి. ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్ల సహాయంతో ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారు. కులం, ఆదాయం, ఆధార్, ఈకేవైసీ, పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, అడంగల్, ఎఫ్ఎంబీ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నూతన రేషన్‌కార్డులు, ఈసీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, విద్యుత్ బిల్లులు, ప్రోపర్టీ ట్యాక్స్ కట్టించుకోవడం తదితర సేవలను ప్రజలకు అందిస్తున్నారు. గతంలో మీసేవా కేంద్రాల్లో ఈ సేవలు అందినప్పటికీ అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడమే కాకుండా బాగా జాప్యం జరిగేది. ఇప్పుడు అలాంటి వాటికి తావు లేకుండా శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన సేవలన్నీ పారదర్శకంగా అందుతుండటంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆఫీసుల చుట్టూ తిరిగే పని తప్పింది



గ్రామ సచివాలయాలు రావడంతో ప్రజలు మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పింది. గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి ఆయా శాఖల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల్లోనే అన్ని శాఖల సేవలు అందుబాటులో ఉండటంతో ఏ సర్టిఫికెట్ అయినా సులభంగా లభిస్తోంది.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు, నూజివీడు మండలం

ఇబ్బందులేమీ లేవు



సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత ఇబ్బందులు ఏమీ లేవు. ఏ అవసరమైనా వలంటీర్‌ను పిలిచి చెబితే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తున్నారు. అవి నిర్ణీత గడువులోగా అందుతున్నాయి. గతంలో పనుల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలేమీ లేవు.

– షేక్ మస్తాన్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

బాధ్యతలు చేపట్టిన అధికారులు



భవానీ శంకరి, నూజివీడు ఆర్డీఓ



కె. కిరణ్‌కుమార్, నూజివీడు ఎంపీడీఓ



పి.శామ్యూల్ ఆగిరిపల్లి ఎంపీడీఓ



సురేంద్ర కుమార్, ఆగిరిపల్లి ఎస్ఐ



రామకృష్ణ, విస్సన్నపేట ఎస్ఐ

నూజివీడు: నూజివీడు రెవెన్యూ డివిజన్ అధికారిగా వై. భవానీ శంకరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై నూజివీడు ఆర్డీఓగా ఆమె వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆదర్శ్ రాజేంద్రన్‌ను ప్రభుత్వం నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో వై. భవానీ శంకరిని నియమించింది. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

నూజివీడు ఎంపీడీఓగా కిరణ్‌కుమార్..

నూజివీడు ఎంపీడీఓగా కె. కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. తణుకు నుంచి బదిలీపై నూజివీడు ఎంపీడీఓగా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వీఏ విజయకుమార్ పల్నాడు జిల్లా బొల్లాపల్లి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. నూతనంగా వచ్చిన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆగిరిపల్లి ఎంపీడీఓగా శామ్యూల్..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ఎంపీడీఓగా పి. శామ్యూల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నిడదవోలు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన శంకరరావు పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు మండల ప్రజా పరిషత్ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఆగిరిపల్లి ఎస్ఐగా సురేంద్రకుమార్..

ఆగిరిపల్లి ఎస్ఐగా బి. సురేంద్ర కుమార్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. టి.నర్సాపురం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన చంటిబాబు విజయవాడ సత్యనారాయణపురానికి బదిలీ అయ్యారు.

విస్సన్నపేట ఎస్ఐగా రామకృష్ణ

విస్సన్నపేట: విస్సన్నపేట ఎస్ఐగా జి. రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన జీవీవీ సత్యనారాయణ తిరువూరు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామకృష్ణ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సిద్ధం సభకు తరలిరావాలి



తిరువూరులో సిద్ధం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: ఏలూరులో శనివారం జరుగనున్న వైఎస్సార్ సీపీ సిద్ధం సభకు తిరువూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్ధం కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేసిందని, పార్టీల వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి కుటుంబం వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

- మైలవరం: ఏలూరులో శనివారం జరుగనున్న సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మైలవరం మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభ ఎన్నికల సమరానికి సిద్ధం అని, సభను విజయవంతం చేయాలని కోరారు.
- విస్సన్నపేట: ఏలూరులో శనివార నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లనున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి సభకు అధికసంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళతారని చెప్పారు. నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- ముసునూరు: ఏలూరులో శనివారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు జి. రంగారావు అన్నారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

సీపీడబ్ల్యూఎస్ స్కీం పరిశీలన



వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు, అధికారులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీకి తాగునీటిని సరఫరా చేసే సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ను జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు శుక్రవారం పరిశీలించారు. ఇటీవలి కాలంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఎన్టీటీపీఎస్ బూడిదనీరు కలవడంతో నీటి సరఫరాలో సమస్య తలెత్తింది. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా విషయం తెలుసుకున్న జెడ్పీ సీఈఓ పథకం నిర్వహణను పరిశీలించారు. తాగునీటి సరఫరా పథకంలో బూడిద కలవడంపై ఆరా తీశారు. ప్రతి రోజూ శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు సీఈఓకు వివరించారు. అనూహ్య పరిణామాలతో తాగునీటి శుద్ధి ప్లాంట్ బూడిద నీటితో కలుషితం అయిందన్నారు. తక్షణమే నివారణ చర్యలు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ఎంపీడీఓ ఉమాదేవి, డీఈఈ దయానంద్, ఏఈ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సెంట్రల్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీల విజేత జట్టు

నూజివీడు: పట్టణంలోని శ్రీ సారథి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జేఎన్‌టీయూ–కే సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. పురుషుల విభాగంలో మైలవరానికి చెందిన లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ప్రథమ స్థానంలోనూ, విజయవాడకు చెందిన ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ స్థానంలోనూ, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ, గుంటూరు చలపతి ఇంజినీరింగ్ కాలేజీలు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రథమ స్థానంలోనూ, నూజివీడుకు చెందిన సారథి ఇంజినీరింగ్ కాలేజీ ద్వితీయ స్థానంలోనూ, ఏలూరుకు చెందిన శ్రీరామచంద్ర ఇంజినీరింగ్ కాలేజీ తృతీయ స్థానంలోనూ నిలిచాయి. సెలక్షన్ కమిటీ చైర్మన్ శ్యామ్‌కుమార్, పరిశీలకులు ఎం.శివశంకర్ పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్, ఏఓ గోపిశెట్టి రామచంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ ఒ.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పథకాలు సక్రమంగా అందించాలి



ఎంపీడీఓను అభినందిస్తున్న ఎంపీపీ దంపతులు

ముసునూరు: ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ అన్నారు. నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు చేట్టిన పద్మావతిదేవిని నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఈదర జట్టు



ఆగిరిపల్లి: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీలు శుక్రవారం ఏలూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో కైకలూరు జట్టుపై ఈదర జట్టు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. విజేతలకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ట్రోఫీ అందజేసి అభినందించారు. ఎంపీడీఓ శామ్యూల్, ఈఓపీఆర్డీ శేఖర్, ఏఓ అబ్దుల్ సలాం, పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ విజేతలను అభినందించారు.

రమణక్కపేటలో రహదారులకు మరమ్మతులు



రహదారి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నాయకులు

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశాలతో రమణక్కపేట బీసీ కాలనీలోని అంతర్గత రహదారులకు శుక్రవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, మాజీ ఉప సర్పంచ్ చందమాల కాంతారావు, రవిప్రకాష్, సచివాలయ కన్వీనర్ నంబూరి రాజు, బండారు శివ, సుధీర్‌బాబు మరమ్మతు పనులను పరిశీలించారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన

మైలవరం: అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఈ. స్వామి అన్నారు. మైలవరం ఫైర్ స్టేషన్‌లో శుక్రవారం స్వామి మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా మైలవరం ఫైర్‌స్టేషన్‌ను సందర్శించామన్నారు. కొత్తగా బేసిక్ ఫైర్ ఫైటింగ్ లెర్నింగ్ అనే కార్యక్రమం ద్వారా మూడు రోజుల పాటు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదాల నియంత్రణపై అవగాహన ఉంటే నష్టాన్ని నివారించవచ్చన్నారు. ఎక్కువగా గ్యాస్ ప్రమాదాలే జరుగుతున్నాయన్నారు. నోటిఫికేషన్ ద్వారా అవసరమైన సిబ్బందిని తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం హోమ్‌గార్డుల సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మైలవరం ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎ.కొండూరు: మండలంలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీఎస్ఆర్ శాస్త్రి శుక్రవారం తెలిపారు. ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

పాడి రైతులకు వైద్య పరీక్షలు



విస్సన్నపేట: కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు విస్సన్నపేట పరిధిలో డాక్టర్ కృష్ణచైతన్య సహకారంతో ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రి, అకిరా కంటి ఆస్పత్రి, కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. 302 మంది పాడి రైతులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారని మేనేజర్ టి. సాంబమూర్తి అన్నారు. జిల్లా పాలక సభ్యులు వాణిశ్రీ, ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్లు శుక్రవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. సర్పంచి మామిడి కుటుంబరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలందించేందుకు వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని వివరించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, ఏఎన్ఎం రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

670 మందికి వైద్య పరీక్షలు

పెద్దకొమిర(గంపలగూడెం): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పీవీ నాగేశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2లో భాగంగా గంపలగూడెం మండలం పెద్దకొమిరలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణులైన వైద్యులచే గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. శిబిరంలో 670 మందిని వైద్యులు పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ వేముల కస్తూరి, ఇన్‌చార్జి ఈఓ జి. శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ భార్గవి పాల్గొన్నారు.

17న తిరువూరులో బాలోత్సవం



తిరువూరు: తిరువూరులో బాలోత్సవం కార్యక్రమం ఈనెల 17న జరుగుతుందని కార్యక్రమ అధ్యక్షుడు డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు తెలిపారు. బాలోత్సవం కరపత్రాలను జయకృష్ణ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు, వారి అభిరుచికి తగిన రంగంలో ప్రావీణ్యం ప్రదర్శించేందుకు రెండోసారి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎం. హరికృష్ణ, సభ్యులు గంగాధర్, గుళ్ళపల్లి వెంకటరత్నం, పాపారావు, భరత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి కొత్త తహసీల్దార్లు

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరువూరు నియోజకవర్గంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లను నియమిస్తూ జిల్లా కలెక్టరు ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. తిరువూరు తహసీల్దార్‌గా కోనసీమ జిల్లా రాయవరం నుంచి కేజే ప్రకాష్‌బాబు, విస్సన్నపేట తహసీల్దార్‌గా కడియం నుంచి ఎం. సుజాత, గంపలగూడెం తహసీల్దార్‌గా రాజమండ్రి నుంచి డి. సుగుణ, ఎ.కొండూరుకు మామిడికుదురు తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ బదిలీపై వచ్చారు.

నేడు రజ్జబ్ పండుగ

ఎ.కొండూరు: చీమలపాడు ఏఎంటీకే దర్బార్‌లో శనివారం రజ్జబ్ (కజ్జికాయల) పండుగ జరుగుతుందని దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరి శుక్రవారం తెలిపారు. మహనీయులు ఇమామే జాఫర్ సాధిక్ వారి నామస్మరణతో ఈ పండుగ నిర్వహిస్తున్నామని, కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.